## చిన్న పిల్లల నాటిక

# బడి మానేశావేం?

[స్కూలు పిల్లలు గోలీలాడుకుంటున్నారు. వాళ్ళ పుస్తకాల సంచులూ, పలకలూ, విడి పుస్తకాలూ అన్నీ, ఒక చోట కుప్ప పడేశారు.

గోలీలాట ఉత్సాహంగా సాగుతోంది. ఆడపిల్లలు కొందరు ఆ ఆట చూస్తూ నిలబడి వున్నారు. వాళ్ళ పుస్తకాలు వాళ్ళ చేతుల్లోనే వున్నాయి.

బడి గంట గణగణమని వినిపించింది. ఆడపిల్లలు వెంటనే పరిగెత్తారు. మొగపిల్లలు కూడా ఆట ఆపేసి, గోలీలు జేబుల్లో వేసుకుని, పుస్తకాల సంచులు తీసుకుని పరుగెత్తుకుంటూ బళ్ళోకి వెళ్ళిపోయారు.

పుస్తకాలతో, పలకలతో, రకరకాల వయస్సుల పిల్లలు నెమ్మదిగా కొందరూ, తొందరగా కొందరూ, జేబుల్లోంచి ఏదో తీసుకుని తింటూ కొందరూ, బడికి పోతున్నారు. (స్టేజి మీద ఒక పక్కనించి ఒక పక్కకి.)

సత్యం పన్నెండేళ్ళ వాడు. కొంచెం శుభ్రంగా వున్న బట్టలు. తల దువ్వుకున్నాడు. భుజాన్న పుస్తకాల సంచి. తొందర తొందరగా వెళ్తున్నాడు. అతను రెండో పక్కకి వెళ్ళేటప్పటికి వెనకనించి రంగన్న వచ్చాడు. రంగన్నకి కూడా సత్యం వయసే. చిరిగిన లాగు, మాసిన బనీను, దుబ్బు జుట్టు. చేతిలో కొడవలీ, గంపా ఉన్నాయి.]

రంగన్న: (దూరంగా వెళ్తూన్న సత్యాన్ని చూసి సంతోషంగా) సత్యం! సత్యం!

సత్యం: (వెనక్కి తిరిగి రంగన్నని చూసి నవ్వు మొహంతో దగ్గిరికి వస్తూ) ఏంట్రా రంగా! బళ్ళోకి రావటం లేదేం?

రంగన్న: (కొంచెం సిగ్గుపడుతూ దిగాలుగా) బడి మానేశాను.

సత్యం: (ఆశ్చర్యంగా) బడి మానేశావా? అదేంటీ, మానేస్తే మరి ఎలా చదువుకుంటావు?

రంగన్న: (తల ఒక పక్కకి వాలేసి) ఇంక చదువుకోను.

సత్యం: ఎందుకూ?

రంగన్న: (మాట్లాడకుండా నించున్నాడు)

సత్యం: నువ్వు బళ్ళోకి రాటంలేదని జగ్గారావు నడిగాన్రా! తెలవదన్నాడు. నీకు జరవొచ్చిందేమో అనుకున్నాను. .... ఏం, జరవేనా?

రంగన్న: (కాదని తల వూపుతూ) జరం నాక్కాదు. మా అయ్యకి.

సత్యం: మీ అయ్యకా? తగ్గిందా?

రంగన్న: ఉహూ! అప్పుడే తగ్గదంటగా?

సత్యం: ఎందుకు తగ్గదూ? మందేసుకుంటున్నాడా?

రంగన్న: ఊహూ! అదే తగ్గుద్దంటగా?

సత్యం: మందేసుకోకపోతే ఎలా తగ్గుద్దిరా?

రంగన్న: ఏమో మరి.

సత్యం: అయితే, నువ్వెందుకు బడి మానేశావు?

రంగన్న: మా అయ్య పన్లోకి పోతన్నా. రోజూ పచ్చగడ్డి కోసి తేవాలి, అయ్య గారింటికి.

సత్యం: (విచారంగా) నువ్వెళ్ళనని చెప్పరాదూ? మీ అయ్యలేచాక వెళ్తాడుగా?

రంగన్న: అలా ఒప్పుకోరంట. మొన్న మా అమ్మ, అళ్ళ దగ్గిర పది రూపాయలు పట్టుకొచ్చింది. నన్ను పన్లోకి పంపుతానంటేనే ఇచ్చారంట.

**సత్యం:** (కొంచెం ఆలోచనగా) మీ అయ్యకి జ్వరం తగ్గిపోయాక వస్తావు కదా?

**రంగన్న:** (కాదన్నట్టు తలతిప్పుతూ) ఊహూ! వాళ్ళకి చిన్న పాలేరు కావాలంట. మా అయ్య నన్ను పెడతానంటన్నాడు.

**సత్యం:** (కోపంగా) నువ్వు చదువుకుంటానని చెప్పెయ్యి!

**రంగన్న:** (దిగాలుపడి) మరి చదువుకుంటే ఎట్టా మరి? పన్లోకెళ్తే బస్తా వొడ్లిస్తారంట ఏడాదికి. రోజూ చద్దన్నం ఆళ్ళే పెడతారంట.

**సత్యం:** (ఏమీ మాట్లాడలేనట్టు నించున్నాడు)

[ఏడెనిమిది సంవత్సరాల వయసున్న రాంబాబుని ఒక పెద్ద పాలేరు చంకనేసుకుని బడికి తీసుకొస్తున్నాడు. రంగన్నా, సత్యం — వాళ్ళని చూస్తూ నిలబడ్డారు.]

**పాలేరు:** ఇంక దిగయ్యా! బడికాడికొచ్చేసినాం. (కుర్రాణ్ణి దింపబోయాడు)

**రాంబాబు:** (దిగకుండా పాలేరు మెడ కావలించుకుని) ఊహూ! నేను బళ్ళోకెళ్ళను. ఇంటికి తీసుకుపో!

**పాలేరు:** రోజూ ఇదే పాటా? చక్కగా బళ్ళో చదూకుంటే ఎంత బాగుంటది!

**రాంబాబు:** ఏం బాగుంటది? ఆకలేస్తే ఏమీ తిననివ్వరు. నిద్దరొస్తే నిద్దర పోనివ్వరు. అస్తమానూ చదువే. ఎదవ చదువు.

**పాలేరు:** ఇంటికాడ అన్నం తిని బయల్దేరావుగా? కడుపు నిండా పప్పూ ఎన్నపూసా గడ్డపెరుగూ అరిటిపళ్ళూ అన్నీ తిన్నావు, ఇంకా ఆకలేంటి? మద్దేన్నం మళ్ళీ ఇంటికొచ్చి తింటావుగా?

**రాంబాబు:** (చంక దిగకుండానే) మరి నిద్దరొస్తే?

**పాలేరు:** నిద్దరెందుకొస్తదయ్యా! సందకాడ దీపాలెట్టేటప్పటికే కడుపు నిండా తినేసి దుప్పటి ముసుగెడతావు. తెల్లార్లూ జాగారం చేస్తావా నిద్దర్లేకండా?

**రాంబాబు:** ఊహూ! బళ్ళోకెళ్ళి కూచుంటే చాలు నిద్దరొచ్చేస్తది.

**పాలేరు:** నిద్దరొస్తే ఆపుకోవాలి. మరి చదువంటే వూరికే వస్తదనుకుంటున్నా వేంటి? కష్టపడి చదువుకుంటే పెద్దోడయ్యాక పే.... ద్ద... ఉద్దోగం చేస్తావు!

**రాంబాబు:** మా నాన్న చదువుకున్నాడేంటి? పెసిడెంటు ఉద్దోగం చెయ్యటంలా?

**పాలేరు:** అది ఏరయ్యా బాబూ! నువ్వూ పెసిడెంటవుతావా?

**రాంబాబు:** ఊహూ: పోలీసినస్పెక్టరవుతా!

**పాలేరు:** మరైతే సదూకో.

**రాంబాబు:** చదువెందుకూ? కాకీ లాగేసుకుని లాటీ కఱ్ఱ పట్టుకుంటే చాలంట. మా నాన్న చెప్పాడులే!

**పాలేరు:** (విసుగ్గా) నీలాగ నన్ను సదివిస్తేనా సిన్నప్పుడు, ఎంత సదివేవోణ్ణో! బడి మానిపించేస్తే రెండ్రోజులు కూడు తినకండా ఏడిశాను. మీ అయ్యలాగ మా అయ్యకి డబ్బుంటేనా? ఎమ్మేలు, బియ్యేలు సదివేసేవోణ్ణి. సదువు మూడో నేత్రవయ్యా బాబూ! సదువుకుంటే ప్రెపంచకం గురించి అన్నీ తెలుస్తాయి. (ఆ మాటలు మాట్లాడుతూ కుర్రాణ్ణి చంకలోంచి కిందికి దింపాడు.)

**రాంబాబు:** నేన్రాను, నేన్రాను. (పెనుగులాట మొదలెట్టాడు.)

**పాలేరు:** (కోపంగా) ఇలాగయితే పంతులు గారికి కబురంపుతా. (సత్యం వేపు చూస్తూ) ఎవరన్నా పంతులు గారిని పిలుచుకు రండి బాబూ! ఈయన్ని సితకదన్ని లాక్కుపోతారు. ఎళ్ళకేం చేస్తాడో చూద్దాం.

**రాంబాబు:** (పెనుగులాటతో చెయ్యి వదిలించుకుని) చెప్పుకో, చెప్పుకో. చెప్పెట్టి కొట్టుకో! (అంటూ పరిగెత్తుకు పోయాడు.)

**పాలేరు:** (వెనకనించీ పుస్తకాల సంచి పట్టుకుని) అబ్బాయి గారూ! అబ్బాయి గారూ! (అంటూ పరిగెత్తాడు.)

[ఇద్దరు చిన్నపిల్లలు లాగులు జారిపోతూ పలకలు పట్టుకుని సత్యం వాళ్ళ ముందునించి నడుచుకుంటూ వెళ్ళారు.]

రంగన్న: బడిగంట కొట్టి చాలా సేపైంది. నువ్వెళ్ళు సత్యం.

సత్యం: ఫర్వాలేదులే. ఇంకా సెకండ్ బెల్లవలేదు. మన లెక్కల మేష్టారుగారి చంటబ్బాయి చచ్చిపోయాడు తెలుసా?

రంగన్న: (ఆశ్చర్యంగా) ఎప్పుడు? ఎందుకు చచ్చిపోయాడు?

సత్యం: ఏంటో జబ్బంట. పెద్దాసుపత్రికి తీసికెళ్తే రెండొందలడి గారంట! మేష్టార్లకి ఆర్నెల్లనించీ జీతాలివ్వటం లేదంట!

రంగన్న: అవును. నిన్న తెలుగు మేష్టారబ్బాయి సుబ్బయ్య కొట్టుకొస్తే అప్పు తీర్చలేదని పోట్లాడాడు సుబ్బయ్య. అప్పు తీర్చకపోతే బియ్యం ఇవ్వనన్నాడు.

[పన్నెండు సంవత్సరాల చిట్టిబాబు బూట్లూ, మంచి బట్టలూ వేసుకుని షోగ్గా చేతులూపుకుంటూ నడచి వస్తున్నాడు. వేళ్ళకి ఉంగరాలున్నాయి. అతని వెనకాల ఎనిమిది సంవత్సరాల చింకి బట్టల కుర్రాడొకడు పుస్తకాలూ, టిఫెన్ కేరేజీ, మంచినీళ్ళ సీసా మోసుకొస్తున్నాడు. మొయ్యలేక మొయ్యలేక మోసుకొచ్చి పుస్తకాలు కింద పడేశాడు.]

బూట్ల చిట్టిబాబు: "ఏంరా, ఒళ్ళు పొగరెక్కిందా? చేతుల్లో బలం లేదా?" (పని కుర్రాణ్ణి కోపంగా కొట్టబోయాడు.)

సత్యం: (వెంటనే అడ్డుపడి) ఏయ్! ఎందుకోయ్ వాణ్ణి కొడతావ్?

బూట్ల చిట్టి: (పొగరుగా) కొట్టాలా, చంపాలా? చూడు వాడేం చేశాడో (నేల మీద పుస్తకాలు చూపించాడు)

సత్యం: (కోపంగా) చిన్నకుర్రాడు అవన్నీ ఎలా మోస్తాడు? గాడిదలా వున్నావు, నీ పుస్తకాలు నువ్వు మోసుకోలేవూ? మహారాజులాగా దర్జాగా నువ్వు నడిస్తే, చిన్న పిల్లోడు నీ పుస్తకాలు తేవాలా? బుద్ధి లేదా? (కిందపడ్డ పుస్తకాలు ఏరడంలో చిన్న కుర్రాడికి సాయం చేశాడు).

[బూట్లు వాడికి కోపం వచ్చి విసవిసా నడుస్తూ బడివేపు వెళ్ళిపోయాడు. తర్వాత చిన్నకుర్రాడు పుస్తకాలూ, టిఫెన్ కారేజీ, నీళ్ళ సీసా మోసుకుపోయాడు. సత్యం కొంచెంసేపు బూట్లవాణ్ణి కోపంగా చూసి మళ్ళీ రంగన్న వేపు తిరిగాడు.]

సత్యం: గోపాలం కూడా బడి మానేశాడు, తెలుసా?

రంగన్న: (ఆశ్చర్యంగా) గోపాలం మానేశాడా? ఎందుకూ?

సత్యం: ఈ ఊళ్ళో బడి బాగా లేదంట. ఇక్కడ అందరూ అలగా పిల్లలంట! మనలాంటి వాళ్ళతో కలిసి చదువుకుంటే వాళ్ళకి చెడ్డ బుద్ధులబ్బుతాయంట. హైద్రాబాదులోనో, మెడ్రాసులోనో అయితే మంచి స్కూళ్ళు వుంటాయంట. అక్కడ చేరతాడంట.

రంగన్న: అవును. వాళ్ళు చాలా డబ్బున్నోళ్ళు.

సత్యం: (వెటకారంగా) డబ్బున్నోళ్ళే! వాళ్ళకంత డబ్బు ఎలా వచ్చిందో తెలుసా? వాళ్ళ నాన్న అందరికీ అప్పులిచ్చి వాళ్ళ నగలూ, గిన్నిలూ ముంతలూ లాగేసి అమ్మేసుకుంటాడు. అలా చేస్తే డబ్బుండదూ?

[గాలి దుమారంలాగ ఒక పిల్ల ఏడుస్తూ బడివేపు పరిగెత్తుకుంటూ పోయింది. ఆ పిల్ల నాయనమ్మ, వెనకనించి కర్ర జాడిస్తూ "బళ్ళోంచి వచ్చావంటే చూడు, తాట వొలుస్తాను" అని కర్రతో బెదిరించి వెనక్కి వెళ్ళిపోయింది.]

సత్యం: (విచారంగా) నువ్వు బడి మానేస్తే నాకేం బాగులేదురా రంగా!

రంగన్న: అసలు ఎంత చదివినా లాభం లేదంటగా? ఏ ఉజ్యోగవూ రాదంటగా!

సత్యం: ఎవరు చెప్పారు?

రంగన్న: చంద్రిగాడి అన్న నాలుగేళ్ళనించి ఉద్యోగాలకోసం అన్ని వూళ్ళూ తిరిగాడంట. ఎంత చదివాడో తెలుసా? బియ్యే చదివాడంట!

సత్యం: మరేం చేస్తున్నాడు?

రంగన్న: కూలి పన్లో కొచ్చాడు. అందుకే మా అయ్య.... 'చదువెందుకూ, కూడెడద్దా, కుమ్మెడద్దా? అయ్యగారింటికి పనికి పోతేనే మంచిద'న్నాడు.

సత్యం: (ఏమీ మాట్లాడలేక నించున్నాడు.)

[8 సంవత్సరాల సుబ్బారావు, చింకి గుడ్డలవాడు, నాలుగైదు సంవత్సరాల పిల్లని వెంటపెట్టుకుని బడికి తీసుకెళ్తున్నాడు. సత్యం, సుబ్బారావుని చూశాడు. సుబ్బారావు ఆగాడు.]

సత్యం: నీ పుస్తకాలేవీ?

సుబ్బా: బడి మానేశాగా!

సత్యం: (ఆశ్చర్యంగా) ఎందుకు మానేశావు?

సుబ్బా: అయ్యగారింట్లో పనికి కుదిరా. రోజూ ఈ అమ్మాయి గార్ని బడికి తీసుకు రావాలి. తర్వాత గొడ్లని తోలుకు పోవాలి. సదువొద్దని మా అయ్య మానిపించేశాడు.

[ఇద్దరు మేష్టర్లు కలిసి వచ్చారు]

తెలుగు మాష్టారు: (పంచె, నిలువు బొట్టు) ఏవర్రా పిల్లలూ, ఇక్కడ నుంచున్నారేం మీరంతా?

సత్యం: (రంగన్ననీ, సుబ్బారావునీ చూపిస్తూ) వీళ్ళిద్దరూ బడి మానేశారండీ మేష్టారూ!

తెలుగు మేష్టారు: (వాళ్ళని కాసేపు పరకాయించి చూచి మొహం చిట్లించి) బడి మానేశారూ? మానేస్తార్రా! మీకు చదువులెందుకు? ప్రభుత్వం వారు బళ్ళు పెట్టి, 'కానీ ఖర్చులేకుండా చదువుకోండ్రా బాబూ' అంటే, వింటారా మీరు? మా పిచ్చిగానీ మీకు చదువులెందుకులే. గొడ్లని కాచుకోండి. మీ తాతలూ ఆ పనే చేశారు, మీ అయ్యలూ ఆ పనే చేశారు, మీరూ ఆ పనే చేసుకోండి వెధవల్లారా!

రెండో మేష్టారు: (కోపంగా) అలా మాట్లాడకండి మేష్టారూ! వాళ్ళు చదువులంటే ఇష్టం లేక బడి మానేశారనుకోకండి! ఇంతింత చిన్న పిల్లలు కూడా వాళ్ళ పొట్టలకోసం వాళ్ళే తడుముళ్ళాడుకోవాలి. గొడ్లని కాచుకోకపోతే, పాలేరుతనం చేసుకోకపోతే, వాళ్ళకి గడవదు. వాళ్ళు బడికొచ్చి ఎలా చదువుకుంటారు? వాళ్ళ పరిస్తితి గమనించకుండా వాళ్ళని హేళన చెయ్యడం చాలా తప్పండీ! ధనవంతుల పిల్లలు బడులు మానేస్తున్నారా? లేదు కదా? పేద పిల్లలే ఎందుకు మానేస్తున్నారు? అది ఆలోచించాలి. ప్రభుత్వాన్ని, ముందు పేదవాళ్ళ పేదతనం పోగొట్టమనండి! ఈ పిల్లలు దొరల దగ్గర పనిచెయ్యకపోయినా వాళ్ళ పొట్టలు నిండేటట్టు చెయ్యమనండి! అలా చేస్తే వీళ్ళే దొరల పిల్లలకంటే బాగా చదువుకుంటారు.

[స్కూలు గంట వినపడుతుంది, గణగణమంటూ. "సుజలాం, సుఫలాం, మలయజ సీతలాం, సశ్యశ్యామలాం" అంటూ, పిల్లలు పాటకూడా మొదలుపెట్టారు. సత్యం బడివేపూ, రంగన్న ఇంకోవేపూ వెళ్ళిపోయారు తెరపడుతుంది.]

[1978 ఫిబ్రవరి "ఉపాధ్యాయ" మాసపత్రికలో] ★